

పచ్చని బంగారం శ్రీగంధం

జిల్లాలో శ్రీగంధం, ఎర్రచందనం సాగు పెరుగుతోంది. దాదాపు 2,500 ఎకరాల్లో వీటిని సాగుచేస్తున్నారు. వీటిలో అంతర పంటలూ సాగుచేస్తున్నారు. - 8లో..



మాదకద్రవ్యాల నిర్మూలనకు చర్యలు

మాదకద్రవ్యాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం

41 /30

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉక్కపోత అధికం. వడగాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ఒంగోలు: ఇంటర్ సప్లిమెంటరీ, అడ్వాన్స్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ప్రథమ సంవత్సరం పరీక్షకు 6263 మంది హాజరుకావాల్సి ఉండగా 5484 మంది మాత్రమే హాజరయ్యారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 1686 మంది హాజరుకావాల్సి ఉండగా 1360 మంది మాత్రమే హాజరయ్యారని ఆర్ఐవో సైమన్ విక్టర్ తెలిపారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

ఒంగోలు: ఉచిత వసతి, భోజనం, శిక్షణ తరగతులు, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఒంగోలు స్కిల్ కాలేజీల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ ఆర్.లోకనాథం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్కిల్ కాలేజీల్లో హై టెక్నికల్ రిలేటెడ్ కోర్సులైన పేషెంటు రిలేషన్స్ సర్వీసెస్ డ్యూటీ మేనేజర్ కోర్సులను 5 నెలలపాటు ఉచిత శిక్షణ, భోజన, వసతి సదుపాయంతో అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం తగిన ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తారన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9988853335 ను సంప్రదించాలన్నారు.

29న హజ్ శిక్షణ, వ్యాక్సినేషన్ క్యాంప్

ఒంగోలు అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ సూచనల మేరకు జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో హజ్-2023 శిక్షణ, వ్యాక్సినేషన్ క్యాంపు ఈ నెల 29వ తేదీ కాపు కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాక్సినేషన్ కార్యక్రమం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. హజ్-2023 సభ్యులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9246482333, 94402 52387, 85558 08533 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేటి నుంచి ఉపాధ్యాయ బదిలీల సర్టిఫికెట్ల పరిశీలన

ఒంగోలు: ఉపాధ్యాయుల బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నవారి సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్లు డీఈవో పి.రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బదిలీలకు దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులకు 2018 నవంబరు 18వ తేదీకి ముందు, ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలలో హెడ్మాస్టర్లుగా కొనసాగుతున్నవారు, 2015 నవంబరు 18వ తేదీకి ముందు ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా కొనసాగుతున్నవారు తప్పనిసరిగా తమ బదిలీల దరఖాస్తును ఆన్‌లైన్‌లో ఈనెల 26వ తేదీలోగా సమర్పించాలన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన బదిలీల దరఖాస్తులను ఈనెల 27వ తేదీ వరకు పరిశీలిస్తారన్నారు. 28, 29 తేదీల్లో ప్రాథమిక సీనియార్టీ జాబితాను విడుదల చేస్తామని, 30న అభ్యంతరాల స్వీకరణ, ఈనెల 31, జూన్ 1వ తేదీ అభ్యంతరాల పరిష్కారం, జూన్ 2, 3 తేదీల్లో తుది సీనియార్టీ జాబితా విడుదల చేస్తారన్నారు. జూన్ 4న ఉపాధ్యాయుల ఖాళీల ప్రదర్శన ఉంటుందని, హెడ్ మాస్టర్లు జూన్ 5, 6 తేదీల్లో, స్కూల్ అసిస్టెంట్లు జూన్ 5 నుంచి 7వ తేదీ వరకు, సెకండరీ గ్రేడ్‌టీచర్లు జూన్ 5 నుంచి 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలన్నారు. హెడ్మాస్టర్లకు, స్కూల్ అసిస్టెంట్లకు జూన్ 9న, సెకండరీ గ్రేడ్ టీచర్లకు జూన్ 9 నుంచి 11వ తేదీ వరకు జాబితా జనరేషన్ ఉంటుందని డీఈవో పి.రమేష్ పేర్కొన్నారు.

పశుసంవర్ధక సహాయకుల జిల్లా అధ్యక్షుడిగా రంగనాథ్



మాచిరాజు రంగనాథ్ (ఫైల్)

నాగులుప్పలపాడు: ప్రకాశం జిల్లా పశు సంవర్ధక సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ముప్పాళ్ల గ్రామానికి చెందిన మాచిరాజు రంగనాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం రాత్రి ఒంగోలులో నిర్వహించిన పశు సంవర్ధక సహాయకుల ఎన్నికల్లో రంగనాథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు మరో 10 మంది కమిటీ సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పరిధిలోని కండ్లగుంట గ్రామ సచివాలయంలో పశు సంవర్ధక సహాయకులుగా పనిచేస్తున్న రంగనాథ్ ఎంపిక పట్ల సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ విజయానంద్ నేడు రాక

ఒంగోలు: ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ విజయానంద్ గురువారం ఒంగోలులో విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్షించనున్నారు. ఉదయం 11 గంటలకు ఆయన స్థానిక ఏపీసీపీడీసీఎల్ ఒంగోలు సర్కిల్ కార్యాలయానికి చేరుకుంటారు. ప్రాజెక్టుల ఎస్ఈ, ట్రాన్స్‌కో ఆపరేషన్స్ అండ్ మెయింటైనెన్స్ ఎస్ఈతోపాటు డిప్యూటీ ఈఈలు సమీక్షకు హాజరుకానున్నారు. సాయంత్రం 2.30 గంటలకు విజయవాడకు బయల్దేరతారు.

బత్తాయి.. ధర అదిరింది

అన్ని సీజన్లలో లభ్యమయ్యే బత్తాయి.. రైతులకు సిరులు కురిపిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా వీటి ధరలు దూకుడు మీద ఉన్నాయని రైతులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ సాగయ్యే బత్తాయిల్లో అత్యధిక శాతం ఉత్తరాదికి ఎగుమతి అవుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో టన్ను ధర రూ.35 వేల నుంచి రూ.40 వేల మధ్య పలుకుతోంది. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 8243.96 ఎకరాల్లో బత్తాయిని సాగు చేస్తున్నారు.



కోల్‌కతాకు బత్తాయి లోడ్ చేస్తున్న కూలీలు

- ప్రస్తుతం టన్ను రూ.40 వేలు
- జూన్ నాటికి రూ.50 వేలకు చేరువలో
- జిల్లాలో 8,200 ఎకరాల్లో సాగు
- అత్యధికంగా యర్రగొండపాలెం, కనిగిరి, దర్శి నియోజకవర్గాల్లో తోటలు
- ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి

యర్రగొండపాలెం: బత్తాయి అధికంగా సాగయ్యే జిల్లాల్లో ప్రకాశం జిల్లా కూడా ఒకటి. జిల్లాలో 38 మండలాలకు గాను 32 మండలాల్లో దీనిని సాగుచేస్తున్నారు. అత్యధికంగా కనిగిరి నియోజకవర్గం పీసీపల్లి మండలంలో 1067 ఎకరాల్లో, తర్వాత త్రిపురాంతకంలో 938, యర్రగొండపాలెంలో 720 ఎకరాల విస్తీర్ణంలో బత్తాయి తోటలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 8243.96 ఎకరాల్లో దీనిని సాగు చేస్తున్నారు. ఎకరాకు తక్కువలో తక్కువ 10 టన్నుల నుంచి 15 టన్నుల మధ్య దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. వాతావరణం అనుకూలంగా ఉంటే కాయ నాణ్యత మరింత పెరిగే అవకాశం ఉంటుందంటున్నారు. పశ్చిమ ప్రాంతంలో నీటికి కొంత ఇబ్బంది పడ్డారు. మిగిలిన ప్రాంతాల్లో వర్షాలు కురవడం, బోర్ల నుంచి నీళ్లు వస్తుండడంతో దిగుబడులు పెరిగే అవకాశం ఉందని ఉద్యానవనశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభంలోనే అంటే మార్చి, ఏప్రిల్ నెలల్లోనే మంచి ధర పలికింది. మే నెలలో టన్ను సుమారు రూ.35 వేల నుంచి రూ.40 వేల మధ్య పలికింది. ఎండలు ఎక్కువగా ఉండడంతో ఈ నెలాఖరుకు, జూన్ మొదటి వారంలో టన్ను ధర రూ.50 వేలు దాటొచ్చని వ్యాపారులు అంటున్నారు. ఎకరాకు సుమారు 10 టన్నుల వంతున 80 వేల టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో సరాసరి ధర రూ.40 వేలు తీసుకుంటే రూ.320 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు.

ఉత్తరాది రాష్ట్రాలకు..

జిల్లాలో సాగయ్యే బత్తాయి ఎక్కువగా ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. ఢిల్లీ, యూపీ, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. అలాగే హైదరాబాద్, చెన్నై మార్కెట్లకు కూడా వెళ్తుంటాయి. యర్రగొండపాలెం ప్రాంతం నుంచి కలకత్తా, ఢిల్లీ, ముంబాయి తదితర నగరాలకు రోజుకు రెండు లారీల చొప్పున రవాణా అవుతున్నాయి.



బత్తాయి కాయల్ని గ్రేడింగ్ చేస్తున్న కూలీలు



బత్తాయి తోట

మంచి ధర పలుకుతోంది:

బత్తాయికి మంచి ధర పలుకుతున్నట్లే.. బోర్లలో నీరు లేక పోవడంతో కాయలు బాగా ఊరలేదు. ఎకరాకు 10 క్వింటాళ్లు తక్కువ కాకుండా కాపు కాస్తోంది. కాయ ఊరితే దిగుబడి బాగా పెరుగుతుంది. రెండు ఎకరాల తోటలో మొదటి కోత 12 టన్నుల దిగుబడి వచ్చింది. ఈ నెలాఖరుకు మరిన్ని కాయలు కోతకు వస్తాయి. అప్పుడు ధర కూడా పెరుగుతుందని అనుకుంటున్నాను.

– కొక్కెర మల్లయ్య, గంజివారిపల్లె, వై.పాలెం మండలం

బత్తాయికి డిమాండ్ ఉంది

బత్తాయికి మంచి డిమాండ్ ఉండడంతో 8 ఎకరాల్లో బత్తాయి తోటను పెంచుతున్నాను. మా ప్రాంతంలో సకాలంలో వర్షాలు కురవడం వలన తోటలు ఏపుగా పెరిగాయి. కాయలు కూడా బాగా ఊరాయి. ఎకరాకు 12 నుంచి 15 టన్నుల దిగుబడి వచ్చే అవకాశాలున్నాయి. వాతావరణం అనుకూలించినట్లయితే బత్తాయికి మంచి ధర పలుకుతుంది. ప్రస్తుతం టన్ను రూ.35 వేలు ఉంది.

– నారు బంగారురెడ్డి, రాచకొండ, పుల్లలచెరువు మండలం

దిగుబడి బాగుంది

నీటి కొరత లేకపోవడంతో ఈ సంవత్సరం బత్తాయి దిగుబడి బాగుంది. పశ్చిమ ప్రాంతంలో మాత్రం నీటికోసం రైతులు ఇబ్బంది పడుతున్నా, తమ తోటలను ఇతర మార్గాల ద్వారా బతికించుకుంటున్నారు. ప్రస్తుతం కాయ నాణ్యతను బట్టి రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు ధర పలుకుతోంది. జూన్ నెల నాటికి టన్ను రూ.50 వేలకు పైబడి ధర పలికే అవకాశం ఉంది.

– పల్లకి ఆదిరెడ్డి, ఉద్యాన శాఖాధికారి, యర్రగొండపాలెం

సాగులో ఉన్న బత్తాయి తోటలు

మండలం	విస్తీర్ణం (ఎకరాల్లో)
యర్రగొండపాలెం	720.77
పుల్లలచెరువు	294.16
త్రిపురాంతకం	938.34
పెద్దదోర్నాల	196.44
పెద్దారవీడు	251.39
దొనకొండ	310.60
కురిచేడు	125.87
ముండ్లమూరు	189.69
దర్శి	137.33
మార్కాపురం	352.64
అర్ధవీడు	475.48
కంభం	51.41
తర్లుపాడు	370.09
కొనకనమిట్ల	12.04
పొదిలి	20.46
తాళ్లూరు	517.78
నాగులుప్పలపాడు	0.20
మద్దిపాడు	37.58
చీమకుర్తి	6.48
మర్రిపూడి	52.97
బేస్తవారిపేట	598.63
రాచర్ల	62.86
గిద్దలూరు	38.90
కొమరోలు	32.51
వెలిగండ్ల	195.79
కనిగిరి	464.46
కొండపి	58.92
పొన్నలూరు	59.33
పీసీపల్లి	1067.80
సీఎస్‌పురం	245.03
పామూరు	356.34
సింగరాయకొండ	1.67
మొత్తం	**8243.96**

కంభం సర్కిల్‌తో ప్రజలకు మెరుగైన సేవలు



నూతన సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ, ఎమ్మెల్యే



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

- ఎస్పీ మలికాగర్గ్
- నూతన సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎస్పీ, ఎమ్మెల్యే

కంభం: స్నేహ పూర్వక పోలీసింగ్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ మలికా గర్గ్ అన్నారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణ అనంతరం పరిపాలన సౌలభ్యం కోసం మార్కాపురం సబ్ డివిజన్ పరిధిలో కంభంలో సర్కిల్ ఏర్పాటు చేయగా పట్టణంలోని పాతపోలీస్ స్టేషన్‌ను నూతన హంగులతో రీమోడలింగ్ చేసి రూపొందించిన కార్యాలయాన్ని బుధవారం గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబుతో కలసి ఎస్పీ ప్రారంభించారు. ముందుగా కార్యాలయంలో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కొత్తగా కంభం సర్కిల్ ఏర్పాటు చేశారని, గతంలో ఈ ప్రాంత ప్రజలు వారి ఫిర్యాదులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు దూరంగా ఉన్న మార్కాపురం వెళ్లాల్సి వచ్చేదన్నారు. నూతన సర్కిల్ కార్యాలయం ఏర్పాటు ద్వారా అర్ధవీడు, బేస్తవారిపేట, కంభం ప్రజలకు ఆ ఇబ్బంది తప్పిందని చెప్పారు. సర్కిల్ కార్యాలయ నిర్మాణానికి పూర్తి సహకారం అందించిన గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యాలయ పనులు త్వరితగతిన పూర్తి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది, సహాయ సహకారాలు అందించిన ప్రజాప్రతినిధులు, ప్రజలకు అభినందనలు తెలిపారు. నిరంతర విధి నిర్వహణలో ఉండే పోలీసులు విశ్రాంతి తీసుకోడానికి వీలుగా విశ్రాంతి భవనం నిర్మించారన్నారు. సర్కిల్ అధికారులు, సిబ్బంది ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని సూచించారు. సమస్యల్లో ఉన్న బాధితులకు సత్వర న్యాయం చేస్తూ డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు మాట్లాడుతూ కంభంలో నూతన సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేయడం వల్ల అర్ధవీడు, బేస్తవారిపేట, కంభం మండల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సర్కిల్ కార్యాలయ నిర్మాణానికి సహకరించిన దాతలందరికీ అభినందనలు తెలిపారు. నూతన సర్కిల్‌లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ వీరరాఘవరెడ్డి, డీఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, కంభం, మార్కాపురం, గిద్దలూరు సీఐ యం.రాజేష్, భీమానాయక్, ఫిరోజ్, సర్కిల్ ఎస్సైలు నాగమల్లేశ్వరరావు, వెంకటేశ్వర నాయక్, మాధవరావు, ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ, కంభం సర్పంచ్ పల్నాటి బోడయ్య, అర్ధవీడు జెడ్పీటీసీ చెన్నువిజయ, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా ప్రభుత్వం



జగనన్న విద్యా దీవెన చెక్కును విద్యార్థులకు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, జేసీ

- విద్యార్థుల తల్లుల ఖాతాల్లో విద్యాదీవెన నగదు
- జిల్లాలో 37,415 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.34.71 కోట్లు
- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు


ఒంగోలు అర్బన్: విద్యార్థులకు ఉత్తమమైన భవిష్యత్తు ఇచ్చేలా అన్నీ విషయాల్లో రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు అన్నారు. బుధవారం తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో జగనన్న విద్యా దీవెన పథకంలో భాగంగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా జమచేసే కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. దీనికి అనుబంధంగా ప్రకాశం భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌తో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒడా చైర్‌పర్సన్ శింగరాజు మీనా వెంకట్రావు పాల్గొన్నారు. దీనిలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 37,415 మంది విద్యార్థులకు చెందిన 33,794 మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.34.71 కోట్లను జమ చేసినట్లు వివరించారు. పేదరికంతో విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంత మంచి కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జేసీ కె.శ్రీనివాసులు

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ విద్యార్థులను ఆర్థికంగా ఇంత పెద్ద స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవడం అభినందనీయమన్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రారంభించి పేద విద్యార్థుల ఉన్నత చదువులకు బాటలు వేశారని గుర్తు చేశారు. ఒడా చైర్‌పర్సన్ సింగరాజు మీనా వెంకట్రావ్ మాట్లాడుతూ విద్యా దీవెన పథకం వల్ల పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు అవకాశం కలుగుతోందన్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ముఖ్యమంత్రి బాటలు వేస్తున్నారని అభినందించారు. దీనిలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి లక్ష్మానాయక్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ అధికారి అర్చన, బీసీ సంక్షేమ అధికారి అంజల పాల్గొన్నారు.

ఖోఖో పోటీల్లో ప్రకాశం బాలుర జట్టుకు ద్వితీయ స్థానం



అండర్-19 విభాగంలో ద్వితీయ స్థానం సాధించిన ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జె.పంగులూరు: రాష్ట్ర స్థాయి అండర్-19 బాలుర ఖోఖో పోటీలు ఈ నెల 21, 22, 23 తేదీల్లో విజయనగరంలో జరిగాయి. పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర జట్టు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. ఈ జట్టులో 12 మంది బాలురు ఉమ్మడి ప్రకాశం జిల్లా జె.పంగులూరు మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు కావటం విశేషం. ఈ సందర్భంగా బాలుర జట్టును ఇంటర్మీడియెట్ బోర్డ్ ఆర్ఐఓ సైమన్, స్కూల్ గేమ్ అండర్-19 సెక్రటరీ ఆదినారాయణ, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచు గరటయ్య, శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య, మాగుంట కళాశాల చైర్మన్ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, కోచ్ పీడీ మేకల సీతారామిరెడ్డి క్రీడాకారులను బుధవారం అభినందించారు. ఒకే కళాశాల నుంచి 12 మంది క్రీడాకారులు ఎంపికవడం గర్వంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ సాదిన రమేష్ అన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభ కనపరిచిన ముగ్గురు క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జూన్ నెల 6 నుంచి 10వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి అండర్-19 స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీల్లో పాల్గొంటారని మేకల సీతారామిరెడ్డి తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కంచెర్ల వెంకట్రావు, పొన్నగంటి గోపి, జనమాల విజయ్‌కుమార్ వీరి ముగ్గురుని స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ కళాశాల లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బేస్తవారిపేట: డబ్బు అప్పు తీసుకునేందుకు తెలిసిన వారి వద్దకు వెళ్లిన ఓ వ్యక్తి కొంత సమయం తర్వాత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కంభం నుంచి పోరుమామిళ్లపల్లె మార్గంలోని పొలాల్లో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. కంభం పట్టణానికి చెందిన మండ్లా రామారావు(48) ఇరవై ఏళ్ల క్రితం మొదటి భార్య స్వగ్రామమైన కురిచేడులో స్థిరపడ్డాడు. మొదటి భార్య చనిపోవడంతో రెండో వివాహం చేసుకుని ఆటో నడుపుతూ అక్కడే నివసిస్తున్నాడు. నెలవారీ ఫైనాన్స్ కంతులు చెల్లించకపోవడంతో ఆ సంస్థ ప్రతినిధులు ఆటోను తీసుకెళ్లారు. దీంతో కూలీ పనులు చేసుకుంటూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో కంభంలో తెలిసినవాళ్లు రూ.10 వేలు అప్పు ఇస్తానంటే మంగళవారం కంభం వచ్చాడు. ఆ తర్వాత ఏమైందో తెలియదు కానీ తన అన్నదమ్ముళ్ల పొలం సమీపంలో చింతచెట్టుకు ఉరేసుకుని చనిపోయాడు. చుట్టు పక్కల పొలాల రైతులు గమనించి కుటుంబ సభ్యులతోపాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాధవరావు తెలిపారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

- ముంబైలో మోగిన సెక్యూరిటీ అలారం
- ఐదు నిమిషాల్లోనే నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

ఒంగోలు: నగరంలో ఏటీఎం చోరీకి యత్నించిన వ్యక్తిని స్థానిక వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. స్థానిక భాగ్యనగర్ రెండో లైన్‌లోని డీసీబీ బ్యాంకు ఏటీఎంలోకి ఒక వ్యక్తి చొరబడ్డాడు. ఏటీఎంను పగలగొట్టేందుకు యత్నించడంతో ముంబైలోని సెక్యూరిటీ ఏజెన్సీకి అలర్ట్ మెసేజ్ వెళ్లింది. వారు తక్షణమే సంబంధిత సమాచారాన్ని పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. ఐదు నిమిషాల వ్యవధిలోనే వన్‌టౌన్ సీఐ టి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఏటీఎం వద్దకు చేరుకున్నారు. పోలీసుల రాకను గమనించిన దొంగ పారిపోయేందుకు యత్నించడంతో వెంటాడి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని రాంనగర్ మొదటి లైనుకు చెందిన చింతగుంట శ్రీనుగా గుర్తించారు. మెరుపు వేగంతో స్పందించి నిందితుడిని అదుపులోకి తీసుకోవడంలో కృషి చేసిన ఒంగోలు డీఎస్పీ నారాయణ స్వామిరెడ్డి, వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు, క్రైమ్ పార్టీ సిబ్బందిని అదనపు ఎస్పీ(క్రైమ్స్) శ్రీధరరావు బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి అభినందించారు.

పాముకాటుకు గురైన కానిస్టేబుల్ మృతి



పవన్‌కుమార్ (ఫైల్)

తాళ్లూరు: తుళ్లూరు మండలం అనంతవరం ఆర్–5 జోన్‌లో విధుల నిమిత్తం వెళ్లిన తాళ్లూరు పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ ఇరిగిపోయిన పవన్ కుమార్ పాము కాటుకు గురై చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. రెండు రోజులుగా గుంటూరు రమేష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ డయాలసిస్ చేసి అన్ని విధాలుగా ప్రయత్నించినా పవన్‌కుమార్ మృతి చెందటం పోలీస్ వర్గాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీస్ ఉన్నతాధికారులు, దర్శి డీఎస్పీ, సీఐ, ఎస్సైలు నిరంతర పర్యవేక్షణ చేసినా సరే పవన్‌కుమార్‌ను దక్కించుకోక పోయారు. పవన్‌కుమార్‌ది చీమకుర్తి పట్టణం. 2012 జనవరి 19లో పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరారు. తాళ్లూరు, ఒంగోలు వన్ టౌన్, ముండ్లమూరులలో పని చేసి మళ్లీ 2020 జనవరి 2న తాళ్లూరు పోలీస్ స్టేషన్‌లలో జాయిన్ అయ్యారు. ఎస్సైగా ఎప్పటికైనా ఎంపిక కావాలన్న ఆశయంతో ఉంటూ అంకితభావంతో పనిచేసే పవన్ ఇక లేక పోవటం దురదృష్టకరమని స్నేహితులు, ప్రజా ప్రతినిధులు అన్నారు. ఆయన మరణం తీరని లోటని అన్నారు. పవన్‌కుమార్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



ఏపుగా పెరిగిన గంధపు చెట్లు

అరుగాలం వ్యవసాయం చేసినా ఆశించిన లాభాలు రావడం లేదని దిగులు చెందుతున్న రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారిస్తున్నారు. ఓపికను పెట్టుబడిగా పెడితే సిరులు కురిపించే పంటల సాగులో మెళకువలు తెలుసుకుని ఆ దిశగా అడుగులేస్తున్నారు. ప్రపంచ మార్కెట్‌లో శ్రీగంధం, ఎర్రచందనం ఉత్పత్తులకు ఉన్న డిమాండ్ దృష్ట్యా ఆయా పంటలు పండించడంలో రైతులు నిమగ్నమయ్యారు. 'పంట సాగుకు ముందు వర్షాలు కురుస్తాయో లేదోననే ఆందోళన అక్కర్లేదు.. దిగుబడి చేతికొచ్చే సమయంలో ఓ జల్లు పడితే నష్టపోతామన్న ఆవేదన అవసరం లేదు.. గిట్టుబాటు ధర దక్కదేమోనని బెంగపడాల్సిన పనేలేదు. పైగా పెట్టుబడి కూడా తక్కువే'నని శ్రీగంధం, చందనం మొక్కలు పెంచుతున్న రైతులు ఒకింత ధైర్యంగా చెబుతున్నారు.

పచ్చని బంగారం.. శ్రీగంధం

- ఎర్రచందనం, శ్రీగంధం సాగుపై మెట్ట రైతుల ఆసక్తి
- జిల్లాలో 2,500 ఎకరాల్లో మొక్కల పెంపకం
- పంట కాలం 15–20 ఏళ్లు.. కళ్లు చెదిరేలా లాభాలు
- మార్కెట్‌లో టన్ను శ్రీగంధం ధర కోటి రూపాయలు

రాచర్ల:

జిల్లాలో శ్రీగంధం, ఎర్ర చందనం మొక్కలు 2,500 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అత్యధికంగా పొదిలి, గిద్దలూరు, రాచర్ల, బేస్తవారిపేట, కొమరోలు, తర్లుబాడు, కనిగిరి మండలాల్లో సాగు చేశారు. రాచర్ల మండలంలోని అరవీటికోట, యడవల్లి, అచ్చంపల్లె గ్రామాల్లో శ్రీగంధం సాగవుతోంది. మార్కెట్‌లో ఎర్ర చందనం తర్వాత శ్రీగంధంకు డిమాండ్ అధికంగా ఉంది. సెంట్లు, సబ్బులు, అగరబత్తీలు, అందమైన బొమ్మల తయారీలో వినియోగించే శ్రీగంధం ధర కేజీ రూ.10 వేల నుంచి రూ.16 వేలు ఉంది. మొక్కలు నాటిన తర్వాత పంట చేతికి రావడానికి 15 నుంచి 20 ఏళ్ల సమయం పడుతుంది. ఒక్కో చెట్టు నుంచి సుమారు 20 కేజీల వరకు దిగుబడి పొందవచ్చు.

సాగు సులభమే..

శ్రీగంధం చెట్ల పెంపకం చాలా తేలిక. అడవి జాతి మొక్కలైన టేకు, జామాయిల్ పెంచినట్లే పెంచవచ్చు. మొక్కల ధర రూ.120 వరకు ఉంటుంది. సాళ్లు, మొక్కల మధ్య దూరాన్ని బట్టి ఒక ఎకరాకు 150 నుంచి 300 మొక్కలు అవసరమవుతాయి. వీటిని ఎటువంటి క్రిమి కీటకాలు ఆశించవు, పశువులు కూడా తినవు. గంధం మొక్కలు నాటే పొలాన్ని నాలుగు నెలల ముందుగా లోతు దుక్కి దున్నుకోవాలి. తరువాత రెండు అడుగుల వెడల్పు, రెండు అడుగుల లోతున గుంతలు తవ్వుకోవాలి. బాగా మగ్గిన పశువుల ఎరువు 8 నుంచి 10 కిలోలు గుంతలో వేసి గంధం మొక్కలు నాటుకోవాలి. ఏడాదికి నాలుగు పర్యాయాలు వేసవిలో నీటి తడులు పెట్టుకుంటే సరిపోతుంది. వర్షాకాలంలో గంధం మొక్కలకు బాగా కుల్లిన పశువుల ఎరువు వేయాల్సి ఉంటుంది. గంధం సాగు రైతులకు సిరులు కురిపించడమే కాదు వాతావరణ సమతుల్యానికి కూడా దోహదపడుతుంది.

అంతర పంటలతో మేలు

మొక్కకు మొక్కకు మధ్య 10 అడుగుల దూరంలో వరుస సాళ్లు వచ్చేలా నాటుకుంటే అంతర పంటలు సాగుచేసుకోవచ్చు. తద్వారా గంధం మొక్కలకు నీరు, సేంద్రియ పోషకాలు నేరుగా అంది వేగంగా ఎదుగుతాయి. 15 నుంచి 20 ఏళ్ల సమయానికి చెట్లు కోత దశకు చేరుతాయి.

ఓపికతో సాగు.. లాభాలు బాగు



రాచర్ల మండలంలోని అరవీటికోట, అచ్చంపేట గ్రామాలకు చెందిన యువ రైతులు షేక్ నాయబ్‌రసూల్, ఎం.రాజశేఖరరెడ్డి, ఎం.రామిరెడ్డి దీర్ఘకాలంలో రాబడినిచ్చే గంధం, శ్రీగంధం సాగు చేస్తూ తోటి రైతుల్లో కొత్త ఆశలు రేకెత్తిస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో పర్యటించి గంధం సాగులో మెళకువలు తెలుసుకున్నారు. నాయబ్‌రసూల్ 2014లో 3 ఎకరాల్లో శ్రీగంధం, గంధం మొక్కలు నాటగా రాజశేఖరరెడ్డి, రామిరెడ్డి తమ రెండెకరాల పొలంలో 2021లో శ్రీగంధం సాగు చేశారు.

పెట్టుబడి తక్కువే..



నేడు మూడు ఎకరాల్లో శ్రీగంధం 300, గంధం 1500 మొక్కలు నాటా. గంధానికి దేశవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. ఇది దీర్ఘకాలిక పంట. నాటిన ఎనిమిదేళ్ల తర్వాత గంధం చెట్టు తయారవుతుంది. బొప్పాయి, మిరప పంటల సాగు కంటే గంధం సాగు పెద్ద కష్టమేమీ కాదు. నాటే సమయంలో రూ.2 లక్షలు పెట్టుబడే తప్ప మిగిలిన సంవత్సరాల్లో పెద్దగా ఖర్చు ఉండదు.

– షేక్.నాయబ్‌రసూల్, అరవీటికోట, రాచర్ల మండలం

అంతర పంటలు కూడా పండిస్తున్నా



2021లో ఎకరా పొలంలో శ్రీగంధం మొక్కలు నాటా. అంతర పంటలుగా మిరప, పత్తి సాగు చేసుకుంటున్నా. ఒకసారి మొక్కలు నాటితే ఏటా పెట్టుబడి గురించి దిగులుపడాల్సిన లేదు. వీటిని ఎటువంటి క్రిమి కీటకాలు ఆశించవు కాబట్టి సాగు భారంగా ఏమాత్రం అనిపించదు.

– ఎమ్. రాజశేఖరరెడ్డి అచ్చంపల్లి, రాచర్ల మండలం

గుండ్లసముద్రం, మర్రిపూడి చెరువులకు మహర్దశ

- పొదిలి చినచెరువు నుంచి భూగర్భ పైప్‌లైన్ నిర్మాణానికి రూ.28.5 కోట్లు
- ముమ్మరంగా సాగుతున్న సమగ్ర భూ సర్వే ప్రక్రియ



అండర్‌గ్రౌండ్ పైపులైన్ నిర్మాణానికి సర్వే పనులను పరిశీలిస్తున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికుమార్

మర్రిపూడి: ప్రజల తాగునీటి కష్టాలు శాశ్వతంగా తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మర్రిపూడి మండలంలోని గుండ్లసముద్రం, మర్రిపూడి ఇరిగేషన్ చెరువులకు మహర్దశ రానుంది. పొదిలి చినచెరువు నుంచి మండలంలోని గుండ్లసముద్రం, మర్రిపూడి చెరువులకు సాగర్ కుడికాలువ నీరు సరఫరా చేసేందుకు పైపులైన్ నిర్మాణం కోసం మైనర్ ఇరిగేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎంజే రవికూమార్ ఆధ్వర్యంలో బుధవారం సమగ్ర భూ సర్వే చేపట్టారు. మండలంలోని 36 వేల మంది ప్రజల నీటి కష్టాలు తొలగించేందుకు రూ.28.5 కోట్లతో పైపులైన్ ఏర్పాటు చేయాలని అంచనాలు తయారు చేయించిన ఎంపీపీ వాకా వెంకటరెడ్డి.. మార్కాపురం పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు సమస్యను వివరించారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ ఆ ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించి, పూర్తి స్థాయిలో అంచనాలు తయారు చేయించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ శాఖాధికారులు టీమ్ సర్వేయర్ తారకరామిరెడ్డితో కలిసి బుధవారం పొదిలి, మర్రిపూడి మండలాలల్లో సమగ్ర భూసర్వే చేపట్టారు. పొదిలి చినచెరువు నుంచి గుండ్లసముద్రం మీదుగా మర్రిపూడి చెరువు వరకు సుమారు 11 కి.మీ మేర పైప్‌లైన్ వేసేందుకు సర్వే చేపడుతున్నట్లు ఏఈ రవికుమార్ తెలిపారు. అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.28.5 కోట్లు మంజూరు చేసిందని పేర్కొన్నారు. పైప్‌లైన్ పూర్తయితే మర్రిపూడి, గుండ్లసముద్రం, వల్లాయపాలెం, దుగ్గిరెడ్డిపాలెం, కెల్లంపల్లి, పన్నూరు, పిన్నికవారి పాలెం, చిమట, శివరాయునిపేట తదితర గ్రామాల ప్రజల దాహార్తి తీరనుంది. సర్వే బృందం వెంట ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, వాకా అంజిరెడ్డి, మారెడ్డి సుబ్బారెడ్డి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు. ఏళ్ల తరబడి తాగునీరు, సాగునీటి కోసం పడుతున్న ఇక్కట్లు తొలగించేందుకు ఎంపీపీ చేసిన ప్రయత్నం ఫలించడంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు చర్యలు

- మార్కాపురం సబ్‌డివిజన్ అధికారులతో సమీక్షలో ఎస్పీ మలికా గర్గ్
- కంభం సర్కిల్ కార్యాలయంలో వార్షిక తనిఖీ



సబ్‌డివిజన్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ మలికా గర్గ్

కంభం: మాదకద్రవ్యాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ మలికా గర్గ్ ఆదేశించారు. కంభం సర్కిల్ కార్యాలయంలో బుధవారం మార్కాపురం సబ్‌డివిజన్ పోలీస్ అధికారులతో నార్కోటిక్స్, ఐటీ యాక్ట్ కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్ల వారీగా నమోదైన గంజాయి, ఐటీ యాక్ట్ కేసుల నమోదు, నేరస్తుల అరెస్టు, దర్యాప్తు తీరుతెన్నులపై అధికారులను ఆరా తీసి ఆయా కేసుల ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఛేదింపునకు, పరిష్కారానికి దోహదం చేసే సూచనలు, మెళకువలను అధికారులకు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాలను ఛేదించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. గంజాయి, ఐటీ కేసుల్లో జాప్యం లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి కేసుల్లో మిగిలిన నిందితులను వెంటనే అరెస్టు చేసి, వారి వెనుక ఎవరెవరున్నారో గుర్తించాలని చెప్పారు. పాతనేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సైబర్ నేరాల ఫిర్యాదు అందిన వెంటనే స్పందించాలని స్పష్టం చేశారు.

ప్రజలకు ఉత్తమ సేవలందించాలి

కంభం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఎస్పీ మలికా గర్గ్ వార్షిక తనిఖీ నిర్వహించారు. సర్కిల్ పరిధిలోని ముఖ్యమైన కేసులపై ఆరా తీసి, రికార్డులు పరిశీలించారు. ప్లాన్ ఆఫ్ యాక్షన్, క్వాలిటీ ఇన్వెస్టిగేషన్‌తో పెండింగ్ కేసులను తగ్గించాలని సూచించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పోలీస్ శాఖపై మరింత నమ్మకం పెంపొందించేలా ఉత్తమ సేవలందించాలని సిబ్బందికి సూచించారు. సర్కిల్ పరిధిలో నేరాలు, శాంతిభద్రతల పరిస్థితులు, అసాంఘిక కార్యకలాపాలపై ఆరా తీశారు. దర్యాప్తులో ఉన్న కేసుల్లో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితులను అరెస్టు చేయాలని, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని ఆదేశించారు. గ్రేవ్ కేసుల్ని తగ్గించాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు మెరుగైన చర్యలు చేపట్టాలన్నారు. స్పందన ఫిర్యాదులపై తక్షణం స్పందించి నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించాలని తెలిపారు. డయల్ 112 నుంచి కాల్ వచ్చిన వెంటనే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించేలా చూడాలన్నారు. విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, చెప్పారు. అనంతరం సర్కిల్ కార్యాలయంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఎస్పీ వీరరాఘవరెడ్డి, సీఐ రాజేష్, ఎస్సైలు నాగమల్లేశ్వరరావు, వెంకటేశ్వరనాయక్, మాధవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



మృతుడు నెలకుర్తి మాల్యాద్రి

కనిగిరి రూరల్: మార్బుల్ పాలిషింగ్ రాళ్ల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ వాగులో బోల్తా పడటంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన కనిగిరి మండలం కంచర్లవారిపల్లి సమీపంలో నేరెళ్లవాగు బ్రిడ్జి వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. పీసీపల్లి మండలం తలకొండపాడు గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మల్యాద్రి(52) అదే గ్రామంలో నిర్మిస్తున్న పాలకేంద్రానికి మార్బుల్స్ తీసుకొచ్చేందుకు ఒంగోలు వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో మార్గమధ్యంలో నేరెళ్లవాగు బ్రిడ్జి వద్ద ఎగమోరు ఎక్కుతుండగా టైర్లు పట్టు సడలి కిందకు జారి వాగులో పడిపోయింది. ఈ ఘటనలో ట్రాక్టర్ ఇంజన్ భాగం డ్రైవర్ మాల్యాద్రిపై పడటంతో నీటిలో చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని కనిగిరి పోలీసులు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అట్టహాసంగా ఎడ్ల పందేలు



ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న వెన్నా హనుమారెడ్డి దంపతులు

తర్లుపాడు: నీలంపాటి లక్ష్మీ అమ్మవారి 13వ వార్షికోత్సవం సందర్భంగా తర్లుపాడులో రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. పోటీలను జెడ్పీటీసీ వెన్నా ఇందిర, సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు వెన్నా హనుమారెడ్డి, ఎంపీపీ భూలక్ష్మిరామసుబ్బారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ వరాలు, ఎంపీటీసీ అంకమ్మ, కోఆప్షన్ సభ్యులు అక్బర్ అలీ, వైస్ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నాయకులు గాయం కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఎబినేజర్ పాల్గొన్నారు.

సత్తా చాటిన నంద్యాల గిత్తలు

నంద్యాల మండలం బిల్లాలపురానికి చెందిన భూమా గోవర్ధన్‌రెడ్డి ఎడ్ల జత 2,591 అడుగులు లాగి మొదటి బహుమతి రూ.50 వేలు, బల్లికురవకు చెందిన వీరాస్వామి ఎడ్ల జత 2,134 అడుగులు లాగి రెండో బహుమతి రూ.40 వేలు, బేస్తవారిపేట మండలం జేసీ అగ్రహారానికి చెందిన నాగశివశంకర్ ఎడ్ల జత 2,079 అడుగులు లాగి మూడో బహుమతి రూ.30 వేలు గెలుపొందాయి. విజేతలకు జెడ్పీటీసీ వెన్నా ఇందిర హనుమారెడ్డి, ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మి రామ సుబ్బారెడ్డి, వాడేల వెంకటసుబ్బయ్య, సుబ్బరామయ్య, మురళీబాబు, శ్రీధర్ సుమంత్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు.

పిటికాయగుళ్ల కొండలో గుర్తు తెలియని మృతదేహం

బేస్తవారిపేట: మండలంలోని పిటికాయగుళ్ల సమీపంలో పిరికేశ్వరస్వామి ఆలయం పైవైపున మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండలో గుర్తు తెలియని మృతదేహం బయటపడింది. గ్రామానికి చెందిన కొందరు బుధవారం తమ పశువులను మేత కోసం కొండకు తోలుకెళ్లారు. అక్కడ ఓ చెట్టు కింద మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. అస్థిపంజరం మాత్రమే ఉన్నట్లు స్థానికులు తెలిపారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.